క్లుప్తంగా

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

చీరాల టౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని, రోజువారీగా గ్రామాలను సందర్శిస్తూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహనలు కల్పించాలని పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీదేవి సూచించారు. బుధవారం పీహెచ్‌సీలోని వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలతో వైద్యులు సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో నివాసముంటున్న ప్రజలకు వేసవిలో ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా అవగాహన కల్పిస్తు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యసేవలను సక్రమంగా అందించాలన్నారు. అలానే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, ప్రజలను చైతన్య వంతులుగా చేయాలన్నారు. రోగాల బారిన పడిన రోగులకు కావాల్సిన మందులను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. గర్భిణులు, చిన్నారులు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్య సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలున్నారు.

సొసైటీ అధ్యక్ష పదవికి రాజీనామా


పూనాటి అప్పారావు

మద్దిపాడు: మండలంలోని నందిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్ష పదవికి పూనాటి అప్పారావు బుధవారం రాజీనామా చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన క్రమంలో తాను రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించి తన రాజీనామా పత్రాన్ని సొసైటీ కార్యనిర్వహణాధికారికి, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అధికారులకు అందించారు. ఆయనతో పాటు డైరెక్టర్లు జవ్వాజి లక్ష్మీనారాయణరెడ్డి, మండవ బాలచంద్రమౌళి కూడా రాజీనామా చేశారు.

పోలేరమ్మకు నైవేద్యాల చెల్లింపు

చీరాల టౌన్: మండలంలోని తోటవారిపాలెం గ్రామంలో కొలువుదీరిన తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారి 55వ వార్షికోత్సవ తిరునాళ్లను మంగళవారం వైభవంగా నిర్వహించగా బుధవారం పొంగళ్లు, నైవేద్యాల చెల్లింపులు చేశారు. అమ్మవారికి మొక్కులు మొక్కుకున్న భక్తులు నైవేద్యాలు చెల్లించారు. అమ్మవారిని విశేష పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చీరాల, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు వేలాదిగా పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను దేవస్థాన కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో పూజలందుకుంటున్న పోలేరమ్మ అమ్మవారు


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం జ్యేష్ఠమాసం మఘ నక్షత్రం సప్తమి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఘనంగా ప్రణీత్ రెడ్డి జన్మదిన వేడుకలు


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న బ్రహ్మానందరెడ్డి, తదితరులు

చినగంజాం: మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి కుమారుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి జన్మదిన వేడుకను చినగంజాంలో బుధవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక వాల్మీకి వృద్ధాశ్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి పుట్టిన రోజు కేక్‌ను కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. అలానే వృద్ధులకు పండ్లు, రొట్టెలు అందించారు. మేడికొండ బాబూరావు, బడుగు అంకయ్య, రావూరి కృష్ణ, అక్కల సుబ్బరామి రెడ్డి, ఏడుకొండలురెడ్డి, ఎ.సురేష్ పాల్గొన్నారు.

అడ్మిషన్ల కోసం ఇంటింటా ప్రత్యేక డ్రైవ్

బల్లికురవ: అనుభవజ్ఞులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఒత్తిడిలేని విద్యతో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ తెలిపారు. అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం అంబడిపూడి, వల్లాపల్లి గ్రామాల్లో పదో తరగతి పాసైన విద్యార్థులు తల్లిదండ్రులను కలిసి అప్లికేషన్లు అందజేశారు. ఏప్రిల్ 19 నుంచి మే ఆఖరువరకు కళాశాల పరిధిలోని పదిగ్రామాల్లో ఇంటింటా తిరిగామని జూన్ మొదటి వారం నుంచి రెండో విడత స్పెషల్ డ్రైవ్‌గా క్యాంపెయిన్ చేపట్టామని ఇప్పటికి 40 మంది విద్యార్థులు దరఖాస్తులు తీసుకుని 28 మంది అడ్మిషన్లు పొందినట్లు వివరించారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ తెలుగు ఇంగ్లిషు మీడియంలో తరగతులు నిర్వహిస్తున్నామని తమ బిడ్డలున్న కళాశాలలో చేర్పించాలని, మీబిడ్డల అభ్యున్నతికి కృషి చేస్తామని అధ్యాపకులు హామీ ఇచ్చారు.


అడ్మిషన్‌ల స్పెషల్ డ్రైవ్

లక్ష్యాలు పూర్తి చేయండి

బల్లికురవ: వైద్య ఆరోగ్యశాఖ సబ్ సెంటర్లలో పనిచేస్తున్న ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు లక్ష్యాలు పూర్తి చేయాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్‌రమీజ్ అహమ్మద్ కోరారు. బుధవారం బల్లికురవ సబ్‌సెంటర్‌లో 104 ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. షుగరు బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి రాలేని వృద్ధుల ఇంటింటికి సాయంత్రం వెళ్లి పరీక్షలు చేశారు. అర్హులైన దంపతులు, గర్భిణులు, చిన్నారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. దీనివల్ల వ్యాక్సిన్లు సకాలంలో వేయడంతో పాటు, ఆరోగ్య పరీక్షలు కూడా సులభతరమవుతాయని చెప్పారు. రికార్డులకు సంబంధించి ఆన్‌లైన్ డేటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచాలని వైద్యాధికారి ఆదేశించారు. ఏఎన్‌ఎం అనూష, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి

నేడు హనుమాన్ శోభాయాత్ర

చీరాల: పట్టణంలో గురువారం సాయంత్రం 4 గంటలకు హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు హనుమాన్ భక్త బృందం బుధవారం తెలిపారు. హనుమాన్ భక్త బృందం, చీరాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక బోస్‌నగర్‌లోని ప్రసాద్ థియేటర్ వద్ద గల వీరాంజనేయ స్వామి దేవస్థానం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. రామమందిరం మీదుగా ముంతావారి సెంటర్, గడియార స్తంభం మీదుగా కూరగాయల మార్కెట్, తెల్లగాంధీ బొమ్మ, నల్లగాంధీ బొమ్మ సెంటర్ మీదుగా తిరిగి వీరాంజనేయస్వామి గుడి వరకు సాగుతుందన్నారు. శోభాయత్రకు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని సూచించారు.

కరవది పీహెచ్‌సీకి షుగర్ టెస్టింగ్ మిషన్ బహూకరణ

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది పీహెచ్‌సీలో నిత్యం అవసరమైన రూ.30 వేల విలువ చేసే షుగర్ టెస్టింగ్ మిషన్‌ను శిరిగిరి కృష్ణారావు, సుబ్బరావమ్మ దంపతులు బుధవారం బహూకరించారు. పీహెచ్‌సీ లేబరేటరీలో రక్తంలోని సీరం, ప్లాస్మా టెస్టులు నిర్వహించేందుకు ఈ మిషన్‌ను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుందర్ ప్రసాద్, హెచ్‌ఈఓ కృష్ణారెడ్డిలకు వారు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ కరవది ఆస్పత్రిని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపై ఉందన్నారు. అందులో భాగంగా తనకు తోచిన సహాయం అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఏ అవసరం ఉన్నా గ్రామస్తుల ద్వారా పొందాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం మీటింగ్ హాలులో సమావేశం నిర్వహించి పలు సమస్యలపై మాట్లాడారు. అనంతరం వలేటివారిపాలెంలో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న భారతిని ఉత్తమ సేవలకుగానూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఫార్మా అసిస్టెంట్ శ్రీధర్, ఎల్‌టీ మహేష్, ఎస్‌ఎన్ జ్యోతి, భానుమతి, సీహెచ్‌ఓ అశోక్ పాల్గొన్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు


లక్ష్మీగణపతి హోమంలో అర్చకులు


గణపతి పూజలో పాల్గొన్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో కార్యసిద్ధి గణపతి

ఒంగోలు మెట్రో: క్రోధి నామ సంవత్సరం జేష్ఠ మాసం బుధవారం నగరంలోని గణపతి ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలను వైభవంగా నిర్వహించారు. స్థానిక పేర్నమిట్ట సిద్ధిబుద్ధి దేవస్థానంలో, కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న గణపతి ఆలయంలో, అద్దంకి బస్టాండ్ దగ్గర ఉన్న విజయ గణపతి దేవాలయంలో, బాబూజీ కాంప్లెక్స్ ఆవరణలో కొలువై ఉన్న వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో, నెల్లూరు బస్టాండ్ దగ్గర సిద్ధి గణపతి దేవాలయంలో, రాజాపానగల్ రోడ్డులోని లక్ష్మీగణపతి దేవస్థానంలో, శ్రీనగర్ కాలనీలోని సిద్ధిబుద్ధి సమేత గణపతి దేవాలయంలో, సమతా నగర్లోని మణికంఠ నగర్లోగల కార్యసిద్ధి గణపతి దేవాలయంలో అర్చక స్వాములు ఉదయం ఏడు గంటలకు గణపతి మూలవిరాట్లకు సుగంధ పరిమళ ద్రవ్యాలు, పసుపు, కుంకుమ, గంధం, విభూది, చందనం, పన్నీరు, కొబ్బరినీళ్లు, పాలు, పెరుగు, తేనె, చక్కెర, వివిధ రకాల పండ్ల రసాలతో పంచామృత అభిషేకం నిర్వహించారు. గణనాథునికి పంచ హారతులిచ్చి భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పించారు. కార్యసిద్ధి గణపతి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.

ప్రకాశంపై గుంటూరు విజయం


131 పరుగులు చేసిన వసంత్‌వర్ధన్

మూలపాడు (ఇబ్రహీంపట్నం): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని మూలపాడు ఏసీఏ గ్రౌండ్‌లో జరుగుతున్న సెంట్రల్ జోన్ అండర్ 23 అంతర్ జిల్లాల వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. ప్రకాశం, గుంటూరు జిల్లాల జట్ల మధ్య బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో గుంటూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు జట్టు 47.5 ఓవర్లకు 288 పరుగులు చేసి ఆల్ అవుటైంది. జట్టు ఆటగాడు డి.వసంత్‌వర్ధన్ 155 బంతులు ఎదుర్కొని 131 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 47.3 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 266 పరుగులు చేసింది. దీంతో 22 పరుగుల తేడాతో గుంటూరు జట్టు విజయం సాధించింది. ప్రకాశం జట్టు బౌలర్ కె.సాత్విక్ 9.5 ఓవర్లు వేసి ఐదు వికెట్లు తీశాడు.

క్రీడల్లో మెళకువలు తెలుసుకోవాలి


క్రీడాకారులకు సూచనలు, సలహాలను అందిస్తున్న సీనియర్ క్రీడాకారులు

చీరాల రూరల్: క్రీడల్లో మెళకువలు తెలుసుకుని ఆడితే ఉత్తమ క్రీడాకారులుగా ఎదుగుతారని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఎస్‌ఆర్‌పీఎం హైస్కూలు క్రీడా మైదానంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ ఫుట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని బుధవారం పలువురు జాతీయ క్రీడాకారులు సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు మంచి సలహాలను సూచనలు అందించారు. సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్ ఇన్‌చార్జ్ బొనిగల ప్రేమయ్య ఆధ్వర్యంలో నెల రోజులుగా చిన్నారులకు ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రతిరోజూ చిన్నారులకు తన సొంత ఖర్చులతో పౌష్టికాహారం అందజేస్తున్న వారిని మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న వైనం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడాకారులు చిన్నతనం నుంచి చదువుతో పాటు క్రీడలపై మక్కువ కలిగి ఉండాలని సూచించారు. క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, తోటి క్రీడాకారులను సోదర భావంతో చూడాలని సూచించారు. క్రీడాకారులు క్రీడలను ఎలాపడితే అలా ఆడకుండా ఆటలో మెళకులను పాటిస్తు (టెక్నికల్ గేమ్) ఆడాలని సూచించారు. జోనల్ ఇన్‌చార్జ్ నూతలపాటి దేవదాసు, క్యాంప్ ఇన్‌చార్జ్ బొనిగల ప్రేమయ్య, కోచ్ ప్రసన్న, నరేష్, బాలశౌరి, జాతీయ క్రీడాకారులు బాబి, జోయల్ పాల్గొన్నారు.

పట్టణంలో వన్‌వే బోర్డుల ఏర్పాటు

కనిగిరి రూరల్: ట్రాఫిక్ సమస్య నియంత్రణలో భాగంగా పోలీస్ అధికారులు సూచించిన మేరకు అడుగులు ముందుకు వేశారు. ఎస్సై టి.త్యాగరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రోడ్లల్లో బుధవారం వన్ వే, బోర్డులను ఏర్పాటు చేశారు. కనిగిరిలో పెరిగిన ట్రాఫిక్ సమస్య నియంత్రించేందుకు వన్ వే దారులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈమేరకు ప్రజలకు అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని,జరిమానాలువిధిస్తామనిహెచ్చరించారు.


వన్ వే బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్లు


ఎడ్ల ప్రభలు


విద్యుత్ కాంతులతో పొట్టేళ్ల ప్రభలు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరులో యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొండపాటూరి పోలేరమ్మ తల్లి తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. వాస్తవానికి ఈ తిరునాళ్ల ప్రతి ఏడాది మే నెలలో నిర్వహిస్తున్నప్పటికీ ఈ ఏడాది ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆలస్యమయ్యాయి. మంగళవారం రాత్రి గ్రామంలో జరిగిన తిరునాళ్లలో అమ్మవారికి 5 ఎడ్ల ప్రభలు, 5 పొట్టేళ్ల ప్రభలతో పాటు మొత్తం 12 ప్రభలను ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమైన ఈ తిరునాళ్లలో వీరతాళ్ల మోతలు, బొల్లావుల సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణలతో అత్యంత వైభవంగా గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ జాతరలో యువత వీరతాళ్లతో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున బుధవారం అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

కనిగిరి రూరల్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 11వ వార్డులోని కాశిరెడ్డి నగర్, ఎస్టీ కాలనీల్లో బుధవారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందర్ని తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలన్నారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనికి పంపినా.. పనిలో చేర్చుకున్నా చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలను అరికట్టడమే లక్ష్యంగా అందరూ పని చేద్దామని పిలుపునిచ్చారు. విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని వివరించారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్ మంద్రు రమేష్, జీఎస్ అండ్‌జీడీకే ఫౌండేషన్ కో ఆర్డినేటర్ నవకుమార్, సచివాలయ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పామూరు: బాల కార్మిక వ్యవస్థను రూపుమాపే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్ అన్నారు. అంతర్జాతీయ బాలకార్మిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఎస్టీకాలనీలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. బాల్యాన్ని పనిభారంలోకి పంపడం సరికాదని, వారిని బడికి పంపి భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది వారికి ఉజ్వలమైన భవిష్యత్‌ను అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా వివిధ పనులకు పోతున్న పిల్లలను, బడిబయట పిల్లలకు విద్య ఆవశ్యకతను గురించి వివరించి బడిఈడు పిల్లలంతా పనులకు కాకుండా విద్యాభ్యాసం కోసం పాఠశాలకు వెళ్లాలని సూచించారు. భువనేశ్వరం ప్రవీణ్, పలువురు పాల్గొన్నారు.